# "మల్లోపాఖ్యానం"

రచయిత :
టి. జె. మోహనరావు

శ్రీ సీతమ్మ కళ్లునులుముకుంటూ ఉదయాన్నే మంచందిగి తలుపు తెరచేసరికల్లా 'మ్యావ్' మంటూ లోపలికి ప్రవేశించింది పిల్లికూన. సీతమ్మకు పట్టలేనంత ఆగ్రహంవచ్చి "ఏం కొంపమునిగినట్టు ప్రొద్దుటే యెదురుగుండా సిద్ధమయ్యావు. నీకేం రోగం వచ్చిందే శని పీనుగా?" అంటూ ఆ నల్లపిల్లిపిల్ల మెడపట్టి విసరవేసింది. అది 'మ్యావ్, మ్యావ్'మని రోదిస్తూ మిక్కిలి వేగంతో తిరిగి లోపలకుపరుగెత్తుగుంటూ చక్కావచ్చింది. సీతమ్మ దానిని కాలుతో బైటకు నెట్టింది కాని, పోలేదు. సీతమ్మకు ప్రాణంవిసిగి "దరిద్రపు వెధవా తెల్లవారకుండా నీ పాపిష్టిముఖం చూచాను. ఇవ్వాళ నాయోగం యెల్లాగుందో? దిక్కుమాలిందానా లేస్తూనే నాకెక్కడ దాపురించావే ప్రాణం కొరుక్కుతినేందుకు?" చీదరించుకుంటూ దాని పీక నులిమివేద్దామన్నంత ఆవేశంతో దాని కంఠాన్ని అదిమి పట్టుకోబోయింది. అది 'మ్యావ్' మని అరుస్తూ గోళ్ళతో సీతమ్మ చేతిని రక్కింది. భయంతో సీతమ్మ రెండడుగులు వెనక్కువేసింది. పిట్టలా ఎగురుకుంటూ పెట్టెల సందుకు దూరింది మార్జాల శాబకం.

"రక్తంకళ్ల చూసానే నీ దుంపతెగా; నీ పాడుముఖం యెదురైంది, రోజస్తమానూ యింకేన్నున్నాయో! దాసీ పీనుగ వస్తుందో రాదో? ఆ సన్యాసిరండ దెబ్బలాడి రెండు రోజుల్నుంచీ రావటంలేదుకూడాను. ఇవ్వాళైనా వస్తుందనుకుంటున్నా. లేచేసరికే నీ శని ముఖం ప్రత్యక్షమయింది. ఇంకెందుకు వస్తుందీ ఆ దరిద్రురాలు! ఇవ్వాళ కూడా నా కర్మం కాలింది. ఒక్కదాన్నీ యింటెడు చాకిరీ చేసుకునేసరికి ఎముకలు విరిగిపోతుంది. ఏదో కొంచెం ఆలస్యమయిందీ అంటే ఆఫీసుకు వేళైపోతూందని ఆయనగారిచేత చీవాట్లు తగులుతున్నాయి. ఇవ్వాళ దెబ్బలరాత కూడా వుందేమో నుదుటిమీద." కోపంతో ముఖం యెఱ్ఱబడగా పిల్లిపిల్లని శపిస్తూ, దాసీ మనిషిని సాదిస్తూ, భర్తను నిందించి తనను తిట్టుకుని ఆందోళనతో ఏపనీ తోచక గుమ్మంలోనే కూర్చునిపోయింది సీతమ్మ.

"యిల్లు చిమ్మేందుకు నీళ్లుతెస్తా బిందె యివ్వండమ్మగారూ" అంటూ దాసీ మనిషి వచ్చి ఎదుట నిలచేసరికి పోయినప్రాణం తిరిగి వచ్చినట్లయింది. అది రెండురోజులు పనిమానినందుకు తలవాచీలా చీవాట్లువేసి ఆ రెండు రోజులకు జీతం తగ్గిస్తానని నిక్కచ్చిగా చెప్పుదామనుకుంది. కాని పిల్లి ముఖం చూస్తూ లేచానే అనేభావం కల్గేసరికి కృంగిపోయి, పనిమనిషిమీద తను చర్య తీసుకునేందుకు ప్రయత్నిస్తే, దాసీ వచ్చినదారికే ముఖం త్రిప్పుతుందేమోనని భయపడి, తను విధింపబోయే శిక్షను మరోనాటికి వాయిదా వేసుకుని, తనకోపాన్ని అణచుకుంటూ, మాట్లాడకుండా పనిమనిషికి బిందెయిచ్చి వూరుకుంది సీతమ్మ.

వేపపుల్లకోసం మూలనున్న బుట్టలో చెయ్యిపెట్టేసరికి "మ్యావ్" మంటూ బుట్టలోనుంచి బయటకు గెంతింది పిల్లిపిల్ల. "ఓసి దరిద్రప్పీనుగా యింతలోనే దూరావుటే బుట్టలో! నీ ముఖం తగులబెడుతా నాగు" మంటూ ప్రక్కనున్న చీపురు యెత్తింది దాని మీదకు. "చీపురివ్వండమ్మా యిల్లూడుస్తా" నని బయటనుంచి పనిమనిషి పిలచేసరికి ఆ చీపురు దానికి విసరి, తను ముఖప్రక్షాళనకు దొడ్డిలోనికి వెళ్ళిపోయింది. ముఖం కడుక్కున్నదో లేదో యింతలో "అంట్లూ చెంబులు తోమేందుకు వేయమని" పనిమనిషి కేక. తను గిన్నెలూ గ్లాసులూ బయటవేసి, ముఖం కడుక్కుని, కాఫీకి కుంపటి అంటించేలోపుగా దాసీది పని పూర్తిచేసి "వెడుతున్నానమ్మా" అంటూ చకచకా నడచింది. ఏడాదిలో యేనాడూ తనెంత వత్తిడిచేసినా ఎనిమిదిగంటల లోపుగా తెమలని పనిమనిషి, అర్ధగంటలో అన్నిపన్లూ వేగంతో ముగించుకుని సూర్యోదయం అయేసరికే కెళ్ళిపోయింది. సీతమ్మ ఆశ్చర్యానికి మేరలేకపోయింది.

కాఫీనీళ్ళు మరగి, కుంపటిమీద నుంచి దింపి ఫిల్టరులో పోద్దామనుకునేంతలో "పాల చెంబు లోపలపెట్టండం"టూ పాలవాడు పిలచాడు. సీతమ్మ మరీ వింతపడింది. పాలువాడుక పెట్టుకున్నది లగాయతు ఫిల్టరులో డికాక్షను దిగి, చల్లారిపోయి, నీరసంతో ఎదురుతెన్నులు చూసిచూసి నిస్పృహతో వున్నప్పుడుగాని పాలుతీసుకురాని పాలవాడు నీళ్లు కాగేసరికల్లా పాలు తీసుకవచ్చాడు. ఎవరిపనులు వాళ్ళు త్వరత్వరగా చేసుకపోతున్నారందరూ ఈనాడు.


పాలుకాద్దామని పాలగిన్నెవైపుకు చూసేసరికి, ఆకులో పిండెలా, పాలగిన్నె ప్రక్కన ఒదిగి కూర్చుంది నల్లపిల్లి. "ఓసీ వెధవ నడు బయటకు" అని దాన్ని బెదిరించి పాలగిన్నె చూస్తే ఒక్కచుక్కకూడా తరిగిలేవు పాలు. "పాలు త్రాగేయలేదు దీని ధర్మమా అని. బుద్ధిమంతురాల్లేనే వుంది. బుద్ధిని పట్టే ముఖంలో దోషావదోషా లుంటాయటకూడాను." అనుకుని కాఫీ కలుపుతూంటే పిల్లి పిల్ల తిరిగివచ్చి కుంపటిప్రక్క చేరింది. సీతమ్మ దాన్ని పరీక్షగా చూసింది. ఒక్క తెల్ల వెంట్రుకకూడా కన్పించలేదు. మెల్లిగాపట్టుకుని అటూయిటూ క్రిందా పైనా దొర్లించి చూసింది. అంతా నీలమేఘశ్యామం. తెల్ల రోమం ఒక్కటికూడా లేదు.

భర్తను లేపి కాఫీ యిచ్చింది. రోజూ తన్ను ఆలస్యంగా లేపుతుందని విసుక్కునే శరభయ్య "ఏమిటి విశేషం?—యింత పెందరాళే నిద్రలేపావు!" — అని చిరునవ్వుతో భర్త పొగడ్తకు సీతమ్మ మురిసిపోయింది. యెన్నిరోజుల్నుంచో కాఫీ సిద్ధంచేసి శరభయ్యను ఉదయాన్నే నిద్రలేపుదామని ఆశించింది. కాని ఎనిమిది గంటలలోపున ఏనాడూ తను శరభయ్యకు మెలకువ తెప్పించలేకపోయింది. యిన్నాళ్ళకు తన కోరిక సిద్ధించింది. పన్లన్నీ అనుకున్నట్లూ అనుకోనట్లూ సక్రమంగా జరిగిపోతున్నాయి. సీతమ్మ అవ్యక్తానందం పొందింది. తనెవ్వరి ముఖం చూసి లేచిందో?—ఈభావం కల్గేసరికి ప్రొద్దుట

నుంచీ తన్ను వెంటాడుతున్న కృష్ణమార్జాల శాబకం గుర్తుకువచ్చి సీతమ్మ పెదిమెలపై చిరునవ్వు నాట్యమాడింది. రోజూ తను మంగళసూత్రం కళ్ళకద్దుకుని చూసి మరీ బయటకు వచ్చేది. ఈరోజున్న మరచిపోయి లేచివచ్చేసరికి పిల్లిపిల్ల ఎదురైంది. ఏం జరుగుతుందో నని భయపడింది కాని ఈనాడే సవ్యంగా వుంది రోజూకంటె. ఈ పిల్లి ముఖంలో బహుశా మంచి వుండితీరాలి. యిల్లాంటి నల్లపిల్లినే వెనుక శ్రీకృష్ణపరమాత్మ పెంచాడట! నల్లపిల్లిలో యెంత పవిత్రత లేకపోతే కృష్ణభగవాను డంతటివాడు పెంచుతాడు? — నల్లపిల్లిలో దోషంలేదు. అలభ్యంగా లభ్యమయింది తనకు. పైగా పిల్లలులేనివాళ్ళకు పిల్లుల్ని పెంచితే బిడ్డలు కల్గుతారట కూడాను. అల్లాంటప్పుడు యింతటి సుగుణాలున్న నల్లపిల్లికూనను తనెందుకు పెంచకూడదు? తను కాపురానికి వచ్చి ఏడెనిమి దేళ్ళయినా తన కడుపున ఒక్కచిన్న నలుసైనా బయలుదేరలేదు. యీపిల్లిపిల్లను సాకుతే తన కడుపు ఫలించితీరుతుంది. యీభావం కల్గేసరికి సీతమ్మ కళ్ళు-జిగేలున మెరసి పళ్లెంలో పాలుపోసి పిల్లిపిల్ల ముందు వుంచి అది త్రాగుతూవుంటే ఆనందంగా, మాతృహృదయం వుప్పొంగ ఆతృతతోదాన్ని చూస్తూ కూర్చునిపోయింది సీతమ్మ.

"కూరలేం తీసుకరమ్మంటావంటూ" శరభయ్య లోపలికివచ్చి ఆ దృశ్యం చూసి "పాలన్నీ దీనికి పోస్తున్నావు. యిదెక్కడ సంప్రాప్తమయింది?—వెధవని నాల్గు తన్ని అవతలకు నడపించు"మంటూ గుమ్మందగ్గర నిలబడిపోయాడు.

"యెక్కడిదేమిటి? భగవంతుడిచ్చాడు. చూడండి! నిగనిగామెరుస్తూ నల్లగా చక్కగా యెంత అందంగా వుందో! పిల్లిముఖం లేవడంతోటే చూస్తే హానిజరుగుతుందంటారు కాని, దీన్నిచూస్తే యెంత శుభమనుకున్నారు? యీ బుల్లిముండాపొట్టలో యెన్నిపాలు పడతాయేమిటి! ఏమండీ, అందంగా లేదూ?" అతని కళ్ళలో చిలిపిగా చూస్తూ, గారాబంగా ఆ పిల్లిపిల్లని తన ముఖందగ్గరకు తీసుకుని వళ్ళు నిమురుతో చిరునవ్వుతో అంది.



"భేషుగ్గావుంది!" ముఖం ముడుచుకుని జవాబిచ్చి చక్కాపొయ్యాడు శరభయ్య బయటకు.

ఆపిల్లికూన పారిపోకుండా ఓతట్టక్రింద వుంచి తట్టమీద బరువుపెట్టింది సీతమ్మ. వంటచేస్తున్నంతసేపూ దానికి "ఏ పేరు పెడదామా" అని ఆలోచించి అలసిపోయి ఓ నిర్ధారణకు రాలేక బాధపడింది.

"ఏమండీ, దానికేపేరుంచితే బాగుంటుందండీ?" అంటూ భోజనం చేస్తున్నంతసేపూ అదనీ, యిదనీ శరభయ్యను ప్రశ్న పరంపరలతో ముంచివేసింది. భర్త దేనికీ సమాధానం చెప్పలేదు. "చాలమంది తమ పిల్లుల్ని 'శీలా' అని పిలుస్తారు కదా, అదేం పేరండీ 'శీలా' మేకూను ఛీఛీ! పాడుపేరు అదేమంతి బాగుందండీ? ఆ పేరు మనం పెట్టనేవద్దు. యింత స్వచ్ఛమైన ఒకే రంగులో వుందికదా, చక్కటి చిన్నపేరేదైనా ఆలోచించండి" అని శరభయ్యకు వూపిరాడనివ్వలేదు. శరభయ్య చిరాకుతో విసుగుకుని వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నందాకా మెదడునలిగిపోయింది కాని ముద్దుపేరు తోచలేదు. నాల్గుగంటలకు పొరుగింటి వెంకంబొమ్మ వస్తే ఆమెను సలహా అడిగింది సీతమ్మ తనపిల్లికి నామకరణం ఏది చేస్తే బాగుంటుందని. "మా మనుమడు యిల్లాగే ఓ తెల్లపిల్లిని పెంచాడు. అందరూ ఆ తెలుపుకు 'మల్లు' అని పేరుపెడితే బాగుంటుందన్నారు. కాని మావాడు మనం యెర్రగావున్నా నల్లవాళ్ళనలేదూ దొరలు? అల్లాగే నా తెల్లపిల్లిని 'నీలాంబరం' అని పిలుస్తానన్నాడు. అయితే, ఆపేరు పొడుగుగా వుందని రానురాను 'నీలీ' అనే పిలచేవాడు. అది ఎగురుకుంటూ చక్కావచ్చేది. అల్లాగే నీపిల్లిని 'పాలూ' అనో 'పెరుగూ' అనో పిలువు. ఆ పదార్థాలంటే పిల్లులు చెవి తెగ్గోసుకుంటాయి కూడాను. చక్కగా వుంటుంది పేరు" అని తన సలహా యిచ్చింది వెంకంబొమ్మ. సీతమ్మ కా సలహా బాగానే వున్నట్టు తోచింది. కాని 'పాలూ' 'పెరుగూ' అనే శబ్దాలు నచ్చలేదు. తెలుపును సూచించే పేర్లన్నిటినీ వెంకంబొమ్మతో తర్జనభర్జన చేసి, చివరకు "మల్లు" అని నామకరణం చేయడానికి తీర్మానించుకుని పెద్దబరువు తన నెత్తినుంచి దిగినట్లు "అమ్మయ్యా" అంటూ సంతోషంతో దీర్ఘనిశ్వాశాన్ని వదలింది సీతమ్మ.

ఇంట్లో మల్లు చేయని పాడుపనిలేదు. పాలువలకపోసేది. పెరుగు త్రాగివేసేది. అన్నింటిమీది మూతలూ క్రిందకు బోర్లించి నానా హంగామాచేసేది. యి స్త్రీ చేసిన బట్టలుపైనవుంటే చాలు, వాటిలో యే ఎలుకనో, కప్పనో చంపి భక్షించేది. శరభయ్యకు దాని చర్యలు సహింపరానివై సీతమ్మ కంట పడకుండ మల్లును తీవ్రంగా శిక్షించేవాడు. మల్లు యెంత అసహ్యాకరంగా ప్రవర్తించినా సీతమ్మ "మల్లూ! నీకు కావలసినవన్నీ నేను యిస్తాగా; యిల్లా పాడుపనులుచేస్తే యెల్లాగ చెప్పు. మరీ యింత అల్లరిదానవైపోతే యెల్లాగ?" అంటూ మల్లువళ్ళు నిమురుతూ బుజ్జగింపు స్వరంతో మందలించేది. శరభయ్య గ్రుడ్లురిమిచూసేవాడు. మల్లును మాటలతోగాని చేతలతో గాని అవమానించేందుకు సీతమ్మ సహించి ఎవరినీ వూరుకునేదికాదు. శరభయ్య ఆ విషయం ఆత్మానుభవంతో గుర్తించి, భార్యతో లేనిపోని రభస యెందుకని మల్లుమీది ద్వేషాన్ని తనలోపలే అణచుకుని వుండవలసివచ్చేది.

ఓనాడు శరభయ్యచొక్కా పరధ్యానంగా మంచంమీద వదలి స్నానానికి వెళ్లాడు. మల్లు ఓ ఉడతను చంపి ఆ చొక్కామడతలో జాగ్రత్తచేసుకుని వెళ్ళింది. శరభయ్య భోజనంచేసి ఆఫీసుకు వెళ్లేందుకు షర్టుతీసి తొడుక్కోపోయాడు. మాంసశకలాలు షర్టునుండి జారాయి. ఉలిక్కిపడి షర్టును పరీక్షించాడు. షర్టంతా మకిలిఅయివుంది. వేరేషర్టు ధరించి వెళ్ళాలనుకుంటే చాకలి బట్టలు తేలేదు. ఆరోజుకు శరభయ్య తప్పని సరిగా ఆఫీసు మానవలసివచ్చింది. శరభయ్య యింక సహింపలేక "యీ వెధవకు తిండిపెట్టడం మాని బయటకు తరుముతావా లేదా?" అని భార్యను గర్జించాడు. సీతమ్మ చలించక అతనికంటె తన కంఠస్వరం పెద్దదిచేసి "యెదుటివాళ్ళు అసహ్యంతో డోకుఅయే పర్యంతం వస్తున్నారని తెలిసికూడా, ఆ వెధవసిగరెట్టు యెందుకు మానారు కాదు? మీకు నోరు వుందనా? అది తెలియక చేసిన తప్పుకు దాన్ని మాడ్చి చంపాలా? యెరిగి వుండి తప్పులుచేసే మిమ్మల్నేమిచేయాలో బాగా ఆలోచించి చెప్పండి. మహాసబబుగా వుంది మీరు చెప్పేది! మీరు పొగత్రాగడం మానండి. అప్పుడు మల్లుచేసే పొరపాట్లకు శిక్ష నేననుభవిస్తాను" అని శరభయ్యమీద పిడుగులు కురిపించింది. శరభయ్య నిర్ఘాంతపోయి పెదిమ కదపకుండా బయటకు నడచాడు. మల్లు 'మ్యావు'మంటూ వచ్చి సీతమ్మ వడిలో దూరింది.

ఆరునెల్లు గతించింతర్వాత మల్లు సంతానవతయి ముగ్గురు బిడ్డల్ని కన్నది. పిల్లలకు పాలు సరిపోవేమోననే భయంతో సీతమ్మ రోజుకు రెండణాలపాలు అదనంగా తెప్పించి మల్లుకు పోసేది. సీతమ్మ హృదయంలో మల్లుకుగల స్థానాన్ని, సన్నిహితత్వాన్ని తలచుకుని శరభయ్య మల్లు కన్పించేసరికి తన హృదయంలో ముల్లుగుచ్చుకున్నట్లు బాధపడి కోపంతో దహించుకుపోయేవాడు. యింతవరకూ ఒక్కమల్లుతోనే ఏవిధంగానో సహనం చూపిస్తూవచ్చాడు. యిప్పుడు మరిమూడు మల్లుకు తోడయ్యాయి. యింక అతని ఓరిమి చెలియలి కట్టదాటింది. మల్లు శరభయ్యకు తీరని సమస్యఅయికూర్చున్నది. వీటన్నిటినీ మొత్తంమీద వదలించుకోనే ఆలోచన ఆరోజు కారోజు అధికమయి శరభయ్యబుర్ర వేడెక్కిపోయినది. అనుకూలసమయంకోసం రేయింబవళ్లు నిరీక్షించాడు.

సీతమ్మ వెంకంబొమ్మగారింటికి కాలక్షేపానికి వెళ్ళింది. ఇన్నిరోజులకు తనకు లభ్యమయిన అమూల్యావకాశానికి శరభయ్య అపరిమితానందం పొంది, మల్లునీ పిల్లల్నీ సంచీలో జాగ్రత్తగాకట్టి బయటకు తీసుకవెళ్లాడు. గొల్ల సుబ్బాయికి యెనిమిదణాలు బహుమతీయిస్తూ ఆ సంచీలోని జీవుల్ని దూరంగా వదలి రమ్మనిపంపి, శత్రుశేషం లేకుండా చేసుకున్నాననే విపరీత సంతోషంతో యింటికి తిరిగివచ్చాడు.

భోజనసమయంలో విస్తరిచుట్టూ మూగే మల్లూ పిల్లలూ ఆ రాత్రి రాకపోయేసరికి ఆందోళనతో యిల్లంతా గాలించి, గొంతు నొప్పి పుట్టేవరకూ పిలచి విసిగివేసారింది సీతమ్మ. "మల్లూ" అనే పిలుపులతో యింట్లో ప్రతివస్తువూ ప్రతిధ్వనించింది. ఆ రాత్రంతా బెంగవల్ల కలత నిద్దరతోనే తెల్లవారింది సీతమ్మకు. తెల్లవారికూడా అవి రాకపోయేసరికి మరింత దిగులుపడిపోయింది. మనస్సు విచారమేఘాలతో ఆవరింపబడి, రోజంతా, సూర్యరశ్మిలేని దుర్దినంలా, నిరుత్సాహంతోనే వుండిపోయింది సీతమ్మ. పన్లన్నీ అలవాటుచొప్పున జరిగాయేకాని, కావాలని యే పనీ చేయలేకపోయింది. యేనాడూ వక్కపూటైనా యిల్లు వదలివుండని మల్లు దినమంతా యిల్లు చేరలేదు. సీతమ్మ చుట్టుప్రక్కలవారి నందరినీ అడిగింది, యెవ్వరూ మల్లును చూసామని చెప్పలేకపోయారు. సీతమ్మ దుఃఖానికి పరిమితి లేకపోయింది. శరభయ్య ఓదార్పులు కూడా ఆమె సంక్షోభాన్ని తగ్గించలేకపోయాయి.

మర్నాడురాత్రి మల్లును గురించిన ఆలోచనల్తో కలతనిద్దరలోనున్న సీతమ్మకు బయట తన్ను మల్లు పిలుస్తున్నట్లయి తలుపు తెరచింది. మల్లూపిల్లలూ ఆమె కాళ్లను— "మ్యావ్"మని అరుస్తూ పెనవైచుక తిరిగాయి. సీతమ్మ భగవద్దర్శనమయిన భక్తుడులా అయింది. వాటిని యెత్తుకుని ఆనందంతో లోపలికి తీసుకపోయి తట్టలో పిల్లలకు పక్కవేసి, మల్లును తనపక్క పరుండజేసి "మళ్ళీ యెక్కడకైనా వెళ్ళావంటే నీకు పాలుపోసేది లేద"ని భయపెడుతూ, బుజ్జగించి అనేక కుశలప్రశ్నలువేసి మల్లుమీద చేయివైచి నిశ్చింతగా నిద్దరబోయింది.

శరభయ్య ఆ పిల్లినీ పిల్లల్నీచూసి నిర్ఘాంతపోయాడు. తను గొల్లసుబ్బాయి నమ్మకస్తుడని అర్థరూపాయ యీనాం ముందే యిచ్చాడు. ఆ సన్యాసిడబ్బులు ముందే కాజేసి వీటిని ప్రక్కనే యెక్కడో వదలివుండాలి. లేకుంటే మర్నాడే యెట్లా వచ్చివుంటాయని వూహించి సుబ్బాయిమీద విపరీతకోపంవచ్చి, వెళ్ళి సుబ్బాయిని వాడుచేసిన మోసానికి తీవ్రంగా నిందించాడు.

"తల్లీ పిల్లల్నీ కలిపి మీరు కాశీలో వదలినా, పిల్లల్నితీసుక చక్కావస్తుంది తల్లి. తల్లికి తెలియకుండా పిల్లల్ని వదలితే, ఆపైన

తల్లిమాట ఆలోచింపవచ్చు. ఇందులో నా దోషం యేమాత్రం లేదం''టూ సుబ్బాయి అనేక ఉదాహరణలతో తననేరం లేదని ఋజువుచేసుకున్నాడు. శరభయ్య నమ్మక తప్పలేదు.

"సరే, పిల్లల్ని తీసుకపోయి దూరంగా వదలిరా" అన్నాడు.

"తల్లీ బిడ్డల్ని వేరుచేస్తే పాపం చుట్టుకుంటుంది. ఆ పాపం నాకెందుకు? ఆపని నావల్ల కాద''ని సుబ్బాయి భీష్మించాడు. అర్ధరూపాయనుంచి రూపాయిన్నరవరకూ బేరమాడి చివరకు సుబ్బాయి నంగీకరింపజేసాడు శరభయ్య.

సీతమ్మ పరధ్యానంగావున్న సమయంలో పిల్లిపిల్లల్ని తీసుకవెళ్ళి రూపాయన్నర బహుమతితో సహా వాటిని సుబ్బాయి చేతిలో వుంచి "జాగ్రత్త సుమా" అని హెచ్చరించాడు.

సుబ్బాయి వాటిని అందుకుంటూ "పిల్లిని కూడా మీయింటికి చేరకుండాచేసే చక్కటి వుపాయం వుంది. మీరల్లా చేసారూ అంటే కావాలని కోరినా పిల్లి మళ్ళీ మీ యింటికి రాదు. వోటిబాన ఒకటి సంపాదించి పిల్లిని అందులోవుంచి, బానమూతిని గోతంతో కట్టివేయండి. ఆ బానను యింటి నడికప్పునుంచి క్రిందకు దొర్లించండి. దొర్లుకుంటూవచ్చి నేల మీద పడీపడడంతోటే బాన బ్రద్దలయిపోతుంది. పైన దొర్లడంలోనూ, క్రింద బ్రద్దలవటంతోనూ వళ్లుతిరిగి, కళ్లు పచ్చపడి తల్లడిల్లిపోయి పిల్లి వెనక్కు తిరిగిచూడకుండా పారిపోతుంది. ఆ పోవడం పోవడం మళ్ళీ మీ దగ్గరకు రాదు'' అని శరభయ్యకు సలహా యిచ్చి చిరునవ్వుతో వెళ్ళిపోయాడు. తనెంత చదువుకున్నా, ఈ అనాగరికుడికి తోచిన వుపాయం తనకు తోచలేదే అనే ఆశ్చర్యంతో తెల్లపోయి ఆ అమూల్య భావానికి శరభయ్య కొయ్యబారి, కొంచెంసేపటికి తెప్పరిల్లి మల్లు ఆ క్షణంలోనే మాయమయినట్లు ఆనందించి యిల్లుచేరాడు.

సీతమ్మ పిల్లిపిల్లలకోసం వెతికి వెతికి చివరకు "పిల్లిపిల్లల్ని పెట్టి యేడిళ్లు తిప్పుతుందంటారు. యెక్కడికైనా తీసుకపోయిందేమో నన్న శరభయ్య సూచనకు "కాబోలు" ననుకుని తృప్తిపడింది. శరభయ్య తనలో తను నవ్వుకున్నాడు.

శరభయ్య సీతమ్మను కనుమరుగించే సమయంకోసం కొన్ని దినాలు వేచివుండవలసి వచ్చింది. నిరీక్షించగా నిరీక్షించగా ఓనాడు సీతమ్మ పేరంటానికి వెళ్ళిన సమయంలో శరభయ్యకు మల్లు వంటరిపాటున చిక్కింది. తను ముందుగనే జాగ్రత్తచేసివుంచిన బానలో మల్లునుంచి, గుడ్డతో బానమూతి జాగ్రత్తగా కట్టివేసి సుబ్బాయి చెప్పినప్రకారం ఆ కడవను యింటి నడికప్పునుంచి దొర్లించి క్రిందకు దిగివచ్చాడు. ఇంట్లో అడుగు పెడుతూనే శరీరం చమటతో నిండిపోయి, నోరుతెరచి నిశ్చేష్టితుడై నిలబడిపోయాడు. "మ్యావ్! మ్యావ్!" మని రోదిస్తూ పరుగెత్తుకునివచ్చి మహావేగంతో అటకమీదకు యెక్కుతూ కన్పించింది మల్లు. "సుబ్బాయి తన్నో మూఢుడిని చేసివదలాడు. తన్ను అవమానించడానికి సుబ్బాయి తన్ను మోసం చేసాడు. ఆరణాలుపెట్టి కొత్తబాన తీసుకవచ్చాడు. సొమ్ము ఖర్చయింది కాని మల్లును యిల్లు వదలించలేక పోయానే'' అని మథనపడ్డాడు శరభయ్య.

శరభయ్యకు మల్లుసమస్య తీరేలా తోచక దిగులుపడ్డాడు. కలుసుకున్న ప్రతిస్నేహితుడినీ సలహా అడిగాడు. చివరకు ఘంటయ్య చెప్పాడు వెంకటపతివద్ద జాతిగల వేటకుక్కపిల్ల వుందనీ, దాన్నేవిధంగానైనా శ్రమపడి సంపాదిస్తే పిల్లిని క్షణంలో చంపివేస్తుందనీను. పిల్లి ఎక్కడ వదలిపెట్టినా పసికట్టి తిరిగి గృహప్రవేశ మవుతుంది. మరణిస్తే మళ్ళీరాలేదు. శాశ్వతంగా తను శాంతిపొందవచ్చునని తలచి ఘంటయ్య ఆలోచనకు బ్రహ్మానందపడ్డాడు శరభయ్య. తను మల్లును హత్యచేయించేందుకే శునకాన్ని జేరతీసాడని సీతమ్మ అనుమానించకుండా మాత్రం సమాధానంచెప్పి సీతమ్మ ఆగ్రహానికి గురికాకుండా మెలకువతో వుండడంలో తను జాగ్రత్త వహించాలి. మిగిలిన కార్యక్రమం శునకం నిర్వర్తిస్తుందని వూహించుకుని వెంకటపతి వద్దకు వెళ్ళాడు.

కుక్కపిల్లను యిచ్చేందుకనేక అభ్యంతరాలను చూపించాడు వెంకటపతి శరభయ్యకు. తన మనోవ్యధను సహస్రవిధాల హృదయం ద్రవించిపోయేట్టు చెప్పి ప్రార్థించాడు శరభయ్య. కొంతసేపటికి "స్నేహితుడివి నువ్వింత పట్టుపడితే కాదనలేక పోతున్నాను. విన్స్టనుని బెంగుళూరునుంచి అనేక వ్యయప్రయాసల కోర్చి తెప్పించి ప్రాణపదంగా చూసుకుంటున్నాను. దానికి యీ వాతావరణం కొత్తచేసి కొంచెం గజ్జి ప్రారంభిస్తే రాత్రనక పగలనక, జాతిలో పుట్టిందని, అనేక చికిత్సలు చేయిస్తున్నాను. 'నాకెందుకీశ్రమ' అని నీవు నిర్లక్ష్యంగా చూసి దాన్ని అశ్రద్ధచేసావంటే నేను సహించలేను. నీవు దాన్ని శ్రద్ధతో సాకుతానని హామీ యిస్తేనే నీకు యివ్వగలను'' అంటూ వెంకటపతి అతి కష్టంమీద శరభయ్యకు విన్స్టనును యిస్తున్నట్టు చెప్పాడు.

"ఇంతకీ గజ్జేకదా దానికి? దానికేంలే. ఎంత శ్రమైనా సరే భరించి వైద్యంచేయించి విన్స్టనును ఆరోగ్యవంతంగాచేయడం పూచీ నాది. నీకా భయమక్కర్లేద''ని శరభయ్య వెంకటపతిని తృప్తిపరచాడు.

వెంకటపతి గొలుసుపట్టుకుని విన్స్టనును బయటకు తీసుకురాగా దాని రూపంచూసి శరభయ్య శరీరం గగుర్పాటుచెందింది. దాని శరీరం రంగేదో నిర్ధారణ చేసుకునేందుకు వీలులేకుండా రోమాలన్నీ వూడిపోయి చర్మవ్యాధితో వళ్లంతా దద్దుర్లుతేలి భీభత్సంగా వుంది విన్స్టను. విన్స్టను రోదిస్తూ వుంటే "జాగ్రత్తసుమీ'' అని వెంకటపతి హెచ్చరిస్తూ వుంటే శరభయ్య హృదయం వేగంగా కొట్టుకోగా గొలుసును పట్టుకున్నాడు. "కాదం"టే, యిన్ని హామీలూ యిచ్చిన తనకు వెంకటపతివల్ల చిన్నతనం వస్తుందని శరభయ్య విన్స్టను వెంటపెట్టుకపోయాడు.

భర్త బక్కచిక్కిన చీడకుక్కతో వచ్చేసరికి సీతమ్మ చీదరించుకుని హంగామాచేసింది. శరభయ్య స్వేదబిందువుల్ని తుడుచుకుంటూ "పిచ్చిదానా! కొంచెం నలతగా వుందని భయపడితే యెల్లాగ? దాని జాతీ, ఇది పుట్టినచోటూ తెలుసుకుంటే నువ్విల్లాగ మాట్లాడవు. పెద్దపెద్దవాళ్లందరూ తప్పనిసరిగా కుక్కల్ని పెంచితీరుతారు. వెధవ గజ్జి! వారంరోజుల్లో అదేపోతుంది. పిల్లుల్ని పెంచితే యజమానికండ్లుపోవాలని కోరుతుందట! కుక్కనిపెంచితే యజమాని పురోభివృద్ధి కోరుతుంది. పైగా పిల్లుల్ని పెంచడం అప్రాచ్యులకుగాని మనకుకాదు. కాగా కుక్కనుపెంచితే బిడ్డలు కల్గుతారని నీకు తెలియదల్లేవుంది!'' అంటూ గొంతు సవరించు

కుంటూ ఒక్క గుక్కలో విన్‌స్టను జాతినీ విశ్వాసాన్నీ, దానివల్ల కల్గబోయే వుపయోగాలనీ, పెద్ద ఉపన్యాసం ఇచ్చేసరికి సీతమ్మ విన్‌స్టనును మాట్లాడకుండా మంచంకోడుకు కట్టింది. శరభయ్య భారంవదలినట్టు, మల్లు ఆ నాడే నశించినట్టు ఆనందించాడుచిరునవ్వుతో.

ఎన్ని చికిత్సలు చేయించి యెంత శ్రమ పడుతున్నా విన్‌స్టన్ చర్మవ్యాధి తిరుగు ముఖం పట్టనందుకే శరభయ్య విచారిస్తుంటే, సీతమ్మ, మల్లుకీ విన్‌స్టనుకీ విరోధం పోగొట్టి మైత్రికల్గించేందుకు చేసే ప్రయత్నాలు అతనికి మరింత వేదనకల్గించింది. రెండింటికీ అన్యోన్యము కల్గించేందుకు చూడడం సహించలేక సీతమ్మకు తనఅభిప్రాయం నెమ్మదిగా సూచించాడు.” “అదేమిటండీ విపరీతం? యింట్లో అందరూ కలసిమెలసి ఆప్యాయతగా వుండాలని కోరుతారు కాని, యెడముఖం పెడ ముఖం కావాలని యెవరనుకుంటారు! మరీ విరుద్ధం! యెవరైనా వింటే నవ్విపోతారు!!” అంటూ శరభయ్యను మందలించింది.


మంచానికి బంధింపబడివున్న విన్‌స్టనూ, మల్లూ ఓరోజు ఉత్సాహంతో క్రిందామీదా దొర్లుతూ ఆడుకుంటున్నారు. యింతలో శరభయ్య ఆ ప్రదేశానికి వచ్చాడు. శరభయ్యను చూసి విన్‌స్టనుమీదనుండి పారిపోయేందుకు క్రిందకు దుముకబోయింది మల్లు. విన్‌స్టన్ ఆట వుత్సాహంలో మల్లును నోటకరచింది. మల్లు మెడపైన బలమైన గాయమయి రక్తం ప్రవహించింది. ఈ దృశ్యాన్ని చూసిన సీతమ్మ విన్‌స్టను మల్లుపై జరిగించిన అత్యాచారానికి ఆవేదనపొంది, విన్‌స్టనును చీపురుతో శృంగారించింది. విన్‌స్టనుకు జరిగిన అన్యాయానికి సహించలేక శరభయ్య మల్లును తన్నబోయాడు. సీతమ్మ శరభయ్యను తీవ్రంగా మందలించి మల్లుకు ప్రథమచికిత్సచేసింది.

మల్లు కారోజు కారోజు గాయం పెద్దదయి కంఠం వాచి బాధతో మూల్గి మూల్గి ఆహారపానాల్ని ముట్టలేక, సీతమ్మను దుఃఖ సముద్రంలోనూ, శరభయ్యను ఆనందసాగరంలోను ముంచి, ఓ తెల్లవారుజామున లోకయాత్ర చాలించింది. శరభయ్య హృదయం తృప్తితోనిండి విన్‌స్టనును కృతజ్ఞతతో ముద్దెట్టుకొన్నాడు.

ఆఖరిక్షణములో మల్లు సీతమ్మపాదాలను మూర్కొని ప్రేమతో చూసిన చివరిచూపులు సీతమ్మ హృదయాన్ని కదలించి వేసాయి. ఆమె దుఃఖం భరించలేక పెద్దపెట్టున రోదించి అలసిపోయింది. రెండు మూడు రోజులవరకూ మల్లుచూపులు ఆమెను వేటాడుతున్నట్లయి ఆహార నీరాల్ని ముట్టలేక విచారభారంతో కృంగి కృశించిపోయింది. శరభయ్య ఆమె విచారాన్ని పోగొట్టేందు కనేక విధాల శ్రమపడి విఫలుడయ్యాడు. శరభయ్య అనునయించిన ప్రతిసారీ, అతనిమీదా, అతను తీసుకవచ్చిన విన్‌స్టనుమీదా ద్వేషం మరింత ఎక్కువయి సీతమ్మ విన్‌స్టన్‌మీద పగ సాధించి మల్లు ఆత్మకు శాంతికల్గించేందుకు కృతనిశ్చయురాలయింది.

భర్త బహిఃప్రాణంగా యెంచుకుంటున్న విన్‌స్టన్‌మీద భర్త ఎదుట వుండగాగాని, లేక అనుమానించేటట్టుగాగాని, కక్ష సాధించేందుకు సీతమ్మకు ధైర్యం చాలకపోయింది. భర్త తనకెంత వ్యతిరేకించకపోయినా అతనివిషయంలో తన్ను సహించలేడని భయపడి శరభయ్య కనుమానం చిక్కకుండా ప్రతిక్రియ చేయడానికి ఆలోచించింది.

ఓరోజున పుల్లమ్మత్తగారి మనుమరాలు సీతమ్మతో కాలక్షేపానికి వచ్చి విన్‌స్టనును



చూసి “మాఅత్తారింటిలో యింతెకంటె అందమైన కుక్క వకటి వుండేది. యెంత మంచి దనుకున్నారు? పాపం! సంవత్సరమయింది యెక్కడికి పోయిందోయేమో? దాన్ని తలచుకుంటే యీనాటికీ యింటిల్లపాదికీ కన్నీరు రాక మానదు. క్రిందటి దీపావళికి ఏం జరిగిందనుకున్నారు! మామరిది సీమ టపాకాయల గుత్తి వేళాకోళంగా దాని తోకకుకట్టి నవ్వుతూ నిప్పు ముట్టించాడు. అవి మానకుండా ఒకటి తర్వాత ఒకటి విడవకుండా ప్రేలాయి. పాపం! ఆ చప్పుడుకి గుండె లవిసిపోయి అరచుకుంటూ ఒక్కటే పోవడం పోయింది. యింతవరకూ జాడా తెన్నూ లేదంటూ” కంట తడిపెడుతూ చెప్పింది.

ఈవృత్తాంతం విన్నది లగాయతు సీతమ్మ కళ్ళు ఆలోచనతో నక్షత్రాలు మెరసి, క్షణ క్షణం పుల్లమ్మత్తమనుమరాలికి ఆ వుపాయం తెలిపినందుకు మనసులో కృతజ్ఞత చూపింది.

శరభయ్యా సీతమ్మా ఉల్లాసంతో ఉత్సాహంగా ఓ సాయంత్రం బయటి ప్రపంచంతో సంబంధం లేనట్టు సంభాషణ సాగిస్తున్నారు. యిట్లాంటి పవిత్రసమయంకొరకే నిరీక్షిస్తున్న సీతమ్మ సీమటపాకాయలగుత్తి తెచ్చి విన్‌స్టన్‌తోకకు వూడిపోకుండా గట్టిగాకట్టి చటుక్కున అగ్నిసంస్కారంచేసింది. వుత్సాహోద్రేకంలో శరభయ్య అనాలోచితంగా సీతమ్మ చిలిపితనానికి నవ్వుతూ తల పంకించాడు. గుత్తి ఆఖరయేవరకూ టపాకాయలు ప్రేలడం మానలేదు. ప్రేలే ప్రతిటపాకాయ విన్‌స్టన్ పుండ్లకు తగిలి బాధకు తాళలేక క్రిందపడి రోదిస్తూ దొర్లిపోయింది. క్రిందనున్న పెంకులు పుండ్లను మరింత గాయపరచి శరీరం రక్తవరదలై విన్‌స్టన్ తిరిగి లేవలేకపోయింది. అప్పటికి శరభయ్య బాహ్యస్మృతికలిగి ఆ దృశ్యాన్ని చూడలేక కండ్లు మూసుకుని కూర్చునిపోయాడు.

నాల్గయిదురోజులు వేదనతో ఏడ్చి ఏడ్చి పడివుండి శాశ్వతంగా కండ్లుమూసింది విన్‌స్టను. శరభయ్య నిశ్చేష్టితుడయిపోగా అతని కళ్ళు చెమ్మగిల్లాయి. సీతమ్మ ప్రతీకారం తీరిపోయినందుకు హృదయం శాంతించగా, మల్లును తలచుకుని పైటచెరగుతో కన్నీరద్దుకున్నది.